క్లుప్తంగా

విద్యాసంస్థల బంద్ విజయవంతం

గుడివాడ టౌన్: నీట్ పరీక్షల్లో పేపర్ లీకేజ్ నేపథ్యంలో స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఎఫ్ఐ) గురువారం చేపట్టిన విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. బంద్‌కు ప్రైవేట్, కార్పొరేట్, ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యాసంస్థలు సహకరించాయని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.సమరం తెలిపారు. బంద్‌పై ప్రైవేట్ యాజమాన్యాలు ముందుగానే సెలవు ప్రకటించాయని, ప్రభుత్వ పాఠశాలలు బంద్ ప్రకటించనప్పటికీ ఎస్ఎఫ్ఐ నాయకులు పాఠశాలలకు వెళ్లి బంద్‌కు సహకరించాలని కోరగా విద్యార్థులు స్వచ్ఛందంగా తరగతులు బహిష్కరించి సహకారం తెలిపారన్నారు. కార్యక్రమంలో గుడివాడ కార్యదర్శి ఎస్.సమీర్, జిల్లా కన్వీనర్ సాధిక్, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

మాజీ సీఎం రోశయ్య జయంతి



గుడివాడ టౌన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలు గురువారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ కృష్ణాజిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుదీర్ఘ కాలం ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రిగా ఉండి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్సార్ ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడంలో కీలకపాత్ర పోషించారన్నారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పలకలు, సెంటర్‌కు స్టేషనరీ అందజేశారు. ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు ఎక్కల మణిదీప్, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, కొత్తా వీరయ్య, కొత్తా మురళి, సాంబశివరావు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

గుడివాడరూరల్: పట్టణంలో ఫ్లెక్సీల ఏర్పాటుకు పోలీస్ శాఖ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని టూ టౌన్ సీఐ ఎం.నాగదుర్గారావు పేర్కొన్నారు. టూ టౌన్ పీఎస్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ.. ఫ్లెక్సీలు ఏర్పాటు విషయంలో ఎవరినీ కించపర్చే విధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకూడదన్నారు. పోలీసుల అనుమతులతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ధ్వంసం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. అలా ధ్వంసం చేసిన వారి వివరాలు తెలిపితే, తెలిపిన వారి విషయాలను గోప్యంగా ఉంచుతామని సీఐ తెలిపారు. ఫ్లెక్సీలు అనుమతుల్లో భాగంగా ఇచ్చిన గడువు తేదీలోగా తొలగించాలని సూచించారు.

టిడ్కో కాలనీ అభివృద్ధికి నిధులివ్వండి

గుడివాడ టౌన్: టిడ్కో కాలనీ నిర్మాణానికి పురపాలక సంఘం నిధులు కేటాయించాలని కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యురాలు బి.అరుణ కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ జి.బాల సుబ్రహ్మణ్యంకు గురువారం వినతిపత్రం సమర్పించారు. రూ.800 కోట్లతో టిడ్కో గృహాలు నిర్మించి మౌలిక వసతుల అభివృద్ధి కోసం నిధులు కేటాయించలేదన్నారు. ఎన్నికల కోడ్ రావడం వలన ఇతర అభివృద్ధి పనులు నిలిపివేశారని, వాటిని కొనసాగించడానికి పురపాలక సంఘం ముందుకు రావాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన అనంతరం వేలాది మంది గృహాల్లో నివాసం ఉంటున్నారని, వారి అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షుడు సయ్యద్ గౌస్, ఉపాధ్యక్షురాలు ఆర్.సంగమ్మ, సహాయ కార్యదర్శి ఎండీ గౌస్, జి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గన్యశ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త కన్నుమూత



రాపర్ల(పామర్రు): మండల పరిధి రాపర్ల గ్రామంలో ఉన్న గన్యశ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త కాకర్ల అర్జునరావు(85) గురువారం కన్నుమూశారు. గ్రామంలో గన్య శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఆధ్యాత్మిక భావంతో 1987లో నిర్మించి అప్పటి నుంచి ఆలయ వంశ పారంపర్య ధర్మకర్తగా ఉంటూ ఆలయ నిర్వహణ బాధ్యతలను నిర్వహించారు. గతంలో అర్జునరావు విద్యుత్ శాఖలో ఏపీ ఎలక్ట్రిసిటీ చీఫ్ అకౌంటెంట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేశారు. అనంతరం తన శేష జీవితాన్ని ఆలయ నిర్వహణకు కేటాయించారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడలోని తన స్వగృహంలో గురువారం మృతి చెందారు. అర్జునరావు భార్య గతంలోనే మరణించారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కాకర్ల బలరామమూర్తి, కాకర్ల శివయ్య తదితరులు అర్జునరావు పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కైకలూరు: రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయమై అపస్మారక స్థితికి చేరిన వ్యక్తిని రూరల్ ఎస్ఐ టి.రామకృష్ణ తన వాహనంలో కైకలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి సేవా గుణాన్ని చాటుకున్నారు. కైకలూరు అపోలో ఫార్మసీలో పనిచేస్తున్న మండవల్లికి చెందిన తెంటు హేమంత్(42) ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఆటపాక గ్రామం వద్ద రోడ్డుపై గేదె అడ్డురావడంతో అదుపు తప్పి కింద పడిపోయాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని రూరల్ ఎస్ఐ టి.రామకృష్ణ తన వాహనంలో కైకలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం అతడి బంధువులు విజయవాడకు తరలించారు. నిర్లక్ష్యంగా రహదారులపై గేదెలను విడిచిపెట్టడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు.

ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి



పామర్రు తహసీల్దార్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న తహసీల్దార్ శ్రీ పల్లవి

పామర్రు: స్వాతంత్ర్యం కోసం అల్లూరి సీతారామరాజు కొనసాగించిన విప్లవ పోరాటం తెలుగు జాతి చరిత్రలో క్రియాశీలక ఘట్టమని పామర్రు తహసీల్దార్ శ్రీ పల్లవి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అల్లూరి జయంతి కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. అల్లూరి చిత్ర ఫటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ విప్లవ వీరుడు అల్లూరి చేసిన పోరాట పటిమను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. భారత స్వాతంత్ర్య చరిత్రలో ఒక మహోజ్వల శక్తి అల్లూరి అన్నారు. బ్రిటీష్ వారి గుండెల్లో సింహ స్వప్నంగా నిలిచిన విప్లవ జ్యోతి అని, ఆయన జరిపిన సాయుధ పోరాటాలు ద్వారానే స్వాతంత్ర్యం వస్తుందని నమ్మి దాని కోసం తన ప్రాణాలను అర్పించిన మహా యోధుడు అల్లూరి అని వర్ణించారు. అల్లూరి చరిత్ర ఒక ప్రత్యేక అధ్యాయంగా దేశంలో నిలిచిపోయిందని చెప్పారు. కార్యక్రమంలో డీటీ నాగమల్లేశ్వరరావు, ఎన్నికల డీటీ జగన్‌మోహన్‌రావు, మండల సర్వేయర్ పర్వీన్ సుల్తానా, కార్యాలయం సిబ్బంది, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాట పటిమను ఎన్నటికీ మరువలేమని తోట్లవల్లూరు పంచాయతీ కార్యదర్శి పుష్పనాథం అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమం గురువారం జరిగింది. అల్లూరి చిత్రపటానికి పుష్పనాథం పూలమాల వేసి నివాళులర్పించారు. బ్రిటీష్ వారిపై అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటాలు సామాన్యమైనవి కావని, ఆయన మననం చేసుకున్నారు. మహిళా సంరక్షణ కార్యదర్శి శివలీల, గుమస్తా సునీల్‌కుమార్, స్థానికులు పాల్గొన్నారు.

మన్యంవీరుడు అల్లూరికి నివాళి

గుడివాడ టౌన్: మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. గుడివాడ క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద గల అల్లూరి సీతారామరాజు కాంస్య విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశం కోసం జీవితాన్ని, ప్రాణాన్ని ఫణంగా పెట్టి పోరాడిన గొప్ప యోధుడు సీతారామరాజు అన్నారు. ప్రస్తుత సమాజం ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని నాయకులు సూచించారు. సేవా సమితి అధ్యక్షుడు కోసూరి రవిరాజు, కార్యదర్శి వి.కుమార్ రాజా, కోశాధికారి కె.శ్రీనివాసరాజు, గౌరవ అధ్యక్షుడు జి.జగ్గరాజు, ఎం.సూర్యనారాయణ రాజు, బి.నాగవర్ధనరాజు, ఉదయ భాస్కరరాజు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జాతిరత్నం 'అల్లూరి'..

కైకలూరు: దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఎందరో మహానుభావులు ఉన్నప్పటికీ విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజుకు ప్రత్యేక స్థానం ఉందని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చెప్పారు. కైకలూరు మండలం భుజబలపట్నం, ముదినేపల్లి మండలం కొర్రగుంటపాలెంలో అల్లూరి సీతారామరాజు విగ్రహాల వద్ద ఆయన జయంతి సందర్భంగా నివాళులర్పించారు. విద్యార్థులకు ఉచిత పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో క్షత్రియ సేవా సంఘం అధ్యక్షుడు పేరిచర్ల రామరాజు, సెక్రటరీ ఆర్‌వీఎస్ సూర్యనారాయణరాజు, గొట్టుముక్కల రంగరాజు, జంపన రామలింగరాజు, ముదునూరి లింగరాజు, పాత్తూరి వాసురాజు, ప్రసాదరాజు పాల్గొన్నారు. అదే విధంగా కైకలూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో అల్లూరి విగ్రహానికి క్షత్రియ సేవా సంఘం, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో కె.సుజాత ఆధ్వర్యంలో అధ్యాపకులు అల్లూరి జయంతిని నిర్వహించారు.

శాఖా గ్రంథాలయంలో..

ముదినేపల్లి రూరల్: విప్లవ వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు మండలంలో గురువారం ఘనంగా జరిగాయి. స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో అల్లూరి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అల్లూరి జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. గురజ ఎస్సీ కాలనీలో అల్లూరి విగ్రహానికి ఎన్డీయే కూటమి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొరగుంటపాలెం శివారు రాజానగరంలో అల్లూరి విగ్రహానికి స్థానిక అల్లూరి అభిమాన సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



భుజబలపట్నంలో యూనిఫాం, పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో దాతలు



గుడివాడలో నివాళులర్పిస్తున్న క్షత్రియ సేవా సమితి నాయకులు

కైకలూరు: అల్లూరి జయంతిని పురస్కరించుకుని భుజబలపట్నం ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ విద్యార్థులకు గురువారం దాతలు పుస్తకాలు, యూనిఫాం అందజేశారు. గ్రామానికి చెందిన గొట్టుముక్కల రంగరాజు, నంబూరి వెంకటకృష్ణంరాజు, దండు రాము, ముదునూరి నాగరాజు, పెన్మత్స సుబ్బరాజు, రుద్రరాజు రామకృష్ణంరాజు, కొండరాజు, పెన్మత్స అచ్యుతరామరాజు కలిసి 26 మంది బాలికలకు టెస్టు పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. దాతలను కళాశాల అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.లక్ష్మీరాజేశ్వరి, అధ్యాపకులు హరిశంకర ప్రసాద్, కిరణ్‌కుమార్, డాక్టర్ విజయప్రసాద్, రామారావు పాల్గొన్నారు.

బీసీలపై దాడులు దుర్మార్గం



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఈశ్వర్‌కుమార్

గుడివాడ టౌన్: గుడివాడ నియోజకవర్గంలో ఎన్నడూ లేని సంస్కృతి ప్రస్తుత ప్రభుత్వంలో కొనసాగుతుందని మాజీ మంత్రి కఠారి ఈశ్వర్ కుమార్ అన్నారు. గురువారం ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టణ యాదవ సంఘం అధ్యక్షుడు డొక్కు రాంబాబుకు సంబంధించిన కార్ఖానాను కూల్చివేయడం దుర్మార్గమన్నారు. అది కేవలం బీసీలపై దాడులుగా గుర్తిస్తున్నామన్నారు. గతంలో సర్వే నిర్వహించి ఆక్రమణ జరగలేదని అధికారులు తేల్చారని, ఇప్పుడు దురాక్రమణ అంటూ కూల్చివేయడం దారుణమన్నారు. అది కూడా అర్ధరాత్రి వేళల్లో జేసీబీలను తీసుకువచ్చి ఏ విధమైన సమాచారం లేకుండా కూల్చి వేయడం అన్యాయమని చెప్పారు. దాడులు నిర్వహించడం, అనంతరం తిరిగి దాడి చేసిన వారితోనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టించడం విచిత్రంగా అనిపిస్తుందన్నారు. ఈ విధానం సరైనది కాదని గుడివాడ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లినా ఆయన పట్టించుకోపోవడం దురదృష్టకరమని చెప్పారు. ఇక వారిని ప్రశ్నించేది లేదని చంద్రబాబు నాయుడిని ప్రశ్నిస్తామన్నారు. అవసరమైతే ప్రత్యక్షంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలిసి ఈ విధానాలపై చర్చిస్తానని ఆయన అన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం పట్టణ అధ్యక్షుడు డొక్కు రాంబాబు, మెరుగుమాల ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి చర్యలు

ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



పంచాయతీరాజ్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడరూరల్: నియోజకవర్గంలోని 109 రహదారులను రూ.4.39 కోట్లతో నిర్మించేందుకు చర్యలు చేపడతామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. పట్టణంలోని ఏలూరురోడ్డులోని తన కార్యాలయంలో పంచాయతీరాజ్ అధికారులతో రహదారుల నిర్మాణాలకు సంబంధించి సమీక్ష సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే రాము సూచనల మేరకు రూపొందించిన నివేదికలను పంచాయతీరాజ్ అధికారులు ఆయనకు తెలియజేశారు. రోడ్ల నిర్మాణానికి వివిధ విభాగాల ద్వారా మంజూరైన నిధుల వివరాలను పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్ ఎమ్మెల్యేకు వివరించారు.

అధికారులు సహకరించాలి..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము విలేకర్లతో మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని గ్రామాల సమస్యలను ఇప్పటికే డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో మాట్లాడానన్నారు. అంతర్గత రహదారులు, గ్రామాలను కలిపే ప్రధాన రహదారుల నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసుకుంటూ నిధులు తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటానన్నారు. కాగా జెడ్పీ నిధుల నుంచి మంజూరైన రూ.2.8 కోట్లతో గుడివాడ రూరల్ మండలంలో ఆరు రోడ్లు, గుడ్లవల్లేరు మండలంలో 34 రోడ్లు, నందివాడ మండలంలో 14 రోడ్లు వేయనున్నామన్నారు. ఎంజీఎన్ఆర్ఈఎస్ నిధులు రూ.1.8 కోట్లతో మూడు మండలాల్లో కలిపి 37 రోడ్లు, అదే విధంగా డిస్టిక్ మైనింగ్ ఫండ్స్ నిధులు రూ.1.23 కోట్లతో గుడ్లవల్లేరు మండలంలో 7, నందివాడ మండలంలో 10 రహదారులు నిర్మిస్తామని చెప్పారు. గుడివాడ పట్టణంలో రూ.20 లక్షల ఎంపీ నిధులతో ఒక రోడ్డు వేస్తున్నామన్నారు. మొత్తం వెరసి రూ.4.39 కోట్లతో 109 రహదారులను నిర్మిస్తున్నామన్నారు. రోడ్ల నిర్మాణాలకు అధికారులు కూడా సహకరించాలని సూచించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, టీడీపీ సీనియర్ నాయకుడు పిన్నమనేని పూర్ణవీరయ్య(బాబ్జీ), డీఈ వెంకటేశ్వరరావు, ఏఈలు సూరిబాబు, రాధాకృష్ణ, పృథ్వీలు పాల్గొన్నారు.

మురుగు నీరు తరలింపునకు మార్గం చూడండి

గుడివాడ టౌన్: టిడ్కో గృహాలకు సంబంధించి మురుగునీరు బయటకు పోయే మార్గం అన్వేషించాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం కౌన్సిల్ సమావేశం హాలులో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగునీరు తరలించేందుకు డ్రెయినేజీ వ్యవస్థ ఉన్నప్పటికీ దానికి శాశ్వత పరిష్కారం పూర్తికాలేదన్నారు. అవసరమైతే భూ సేకరణ చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.బాల సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ వీరాంజనేయులు, మున్సిపల్ ఇంజినీర్ బి.విజయదుర్గ, డీఈలు పీఆర్సీ ప్రవీణ్, బి.కరుణాకరబాబు, టి.వెంకట రాజు, సర్వేయర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధాన రహదారికి మరమ్మతులు



అల్లూరులో రహదారి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కామినేని, నేతలు

ముదినేపల్లి రూరల్: నియోజకవర్గంలో ప్రధానమైన సింగరాయపాలెం – కోరుకొల్లు ఆర్అండ్‌బీ రహదారి మరమ్మతు పనులను ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ గురువారం ప్రారంభించారు. ఈ రహదారి అల్లూరు నుంచి సింగరాయపాలెం వరకు పూర్తిగా దెబ్బతిని గోతులమయంగా మారింది. ఈ రహదారిని అభివృద్ధి చేసేందుకు కొరగుంటపాలెం శివారు రాజానగరానికి చెందిన కోసూరి రవిరాజు ఆర్థికసాయాన్ని అందించారు. దీంతో అల్లూరుల పనులను ఎమ్మెల్యే కామినేని ప్రారంభించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

భిక్షులకు అన్నదానం ప్రారంభం

కైకలూరు: నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కామినేని పాల్గొన్నారు. కైకలూరు వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో ప్రతి నెలా 1వ తేదీన జరిగే సమావేశానికి విచ్చేయు ప్రజలకు కామినేని తల్లి దివంగత రాజేశ్వరమ్మ పేరుతో ఉచిత భోజనాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలిదిండి మండలంలో పోతుమర్రు–తాడినాడ గ్రామాల మధ్య వంతెన ఇటీవల కూలింది. వంతెన శ్లాబ్ పనులను గురువారం కామినేని ప్రారంభించారు. కామినేని నివాసం వద్ద సత్తెగుల్లపాడు గ్రామంలో ఇరువర్గాల మధ్య అనేక సంవత్సరాలుగా కొనసాగుతున్న వివాదాన్ని బలే ఏసురాజు ఆధ్వర్యంలో పరిష్కరించారు. గ్రామం తరుపున విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను ఎమ్మెల్యేకు అందజేశారు.

ఇన్‌స్పైర్ అవార్డులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ



పెదపుట్లపూడి పాఠశాలలో ఇన్‌స్పైర్ అవార్డుల గురించి వివరిస్తున్న ఎంఈఓ ప్రభాకరరావు

కైకలూరు: విద్యార్థుల్లో శాస్త్రీయ వైజ్ఞానిక ఆలోచనలు, సృజనాత్మకతను ప్రోత్సహించడానికి కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ ఇన్‌స్పైర్ మనక్ అవార్డులు 2024–25కు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తోందని ఎంఈఓ పి.ప్రభాకరరావు చెప్పారు. పెదపుట్లపూడి ఎంపీయూపీ స్కూల్‌లో విద్యార్థులకు అవార్డులపై గురువారం అవగాహన కలిగించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల ఒకటి నుంచి సెప్టెంబర్ 15 వరకు నామినేషన్లు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ప్రతి పాఠశాల నుంచి గైడ్ టీచర్‌తో కలిపి విద్యార్థులు పాల్గొనే అవకాశం ఉందని చెప్పారు. ఇందులో తయారు చేసే ప్రాజెక్టు సామాన్య ప్రజల అవసరాలు తీర్చిదిద్దే విధంగా ఉండాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు పాల్గొనడానికి అర్హులన్నారు. ప్రాథమికోన్నత పాఠశాల నుంచి 3, ఉన్నత పాఠశాల నుంచి 5 ప్రాజెక్టుల ఆలోచనలు పంపించే అవకాశం ఉందన్నారు. ఉత్తమంగా ఎంపిక చేసిన వాటిని వెబ్‌సైట్‌లో నమోదు చేస్తారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులకు రూ.10 వేలు ప్రోత్సాహక బహుమతి అందిస్తారన్నారు. గైడ్ టీచర్లు, విద్యార్థులు సృజనాత్మక శక్తితో నూతన ఆవిష్కరణలు చేయాలని ఎంఈఓ కోరారు.

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా

ముదినేపల్లి రూరల్: వణుదుర్రు పంచాయతీ పరిధిలో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. రక్షిత మంచినీటి పథకం మరమ్మతులకు గురికావడంతో మూడు రోజులుగా కుళాయిల ద్వారా నీటి సరఫరా నిలిచిపోయింది. దీనితో ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పంచాయతీ అధికారులు, సర్పంచ్ స్పందించి ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని అధికారులను కోరడంతో సత్వరమే స్పందించారు. ట్యాంకర్ల ద్వారా వణుదుర్రు శివారు గ్రామమైన కొత్తపల్లిలో ఇంటింటికీ తాగునీరు సరఫరా చేశారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా రెండు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు.

వీఎం రంగా సేవలు చిరస్మరణీయం

- వాడవాడలా వంగవీటి రంగా జయంతి వేడుకలు
- రంగా సేవలను కొనియాడిన నేతలు



కైకలూరులో రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే డీఎన్నార్



కైకలూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని, నాయకులు

కైకలూరు: బడుగు బలహీన వర్గాలకు వంగవీటి మోహనరంగా చేసిన సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) చెప్పారు. గురువారం రంగా 77వ జయంతి సందర్భంగా కైకలూరు గాంధీబొమ్మ సెంటర్, ఆటపాక సెంటర్లలో వంగవీటి రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీఎన్నార్ మాట్లాడుతూ రంగా ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకు సాగాలన్నారు. అందరికీ మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు జంపన కొండరాజు, బొప్పన శివ కుమార్, తోట మహేష్, ఉండ్రమట్ల ఏసుబాబు, పెంటా అనిల్ కుమార్, ఫిరోజ్ ఖాన్, మడక శ్రీను, మానికొండ సత్యనారాయణ, రెడ్డి శ్రీను, కొండా మేస్త్రి, బుర్ల భోగేశ్వరరావు, తలారి సత్యనారాయణ, సమ్మెట సాంబశివరావు, సింగంశెట్టి రాము, కన్నా బాబు, తమ్మిశెట్టి కొండా, సిద్దాబత్తుల శ్రీరామమూర్తి, ఘంటసాల సురేష్, చొప్పాల రాము, మానికొండ సత్యనారాయణ పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: మాజీ ఎమ్మెల్యే వీఎం రంగా జయంతి మండలంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల్లో రంగా విగ్రహాలకు అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముదినేపల్లి, గురజ గ్రామాల్లో రంగా విగ్రహాలకు టీడీపీ నేతలు కొడాలి వినోద్, వీరమల్లు నరసింహారావు, జనసేన నేతలు వీరంకి వెంకటేశ్వరరావు, ఏఎన్ బాబు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా చిగురుకోట శివారు నరసన్నపాలెం, సింగరాయపాలెం, బొమ్మినంపాడు, గ్రామాల్లో రంగా జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.

పామర్రు: వంగవీటి మోహనరంగా 77వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పామర్రులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆదేశాల మేరకు రంగా జయంతి వేడుకలను నిర్వహించారు. కాపు సంఘ నాయకులు తిరుమలశెట్టి వాసు, కాకర్ల వెంకటేశ్వరరావు, తాడిశెట్టి శ్రీనివాసరావు రంగా సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, నాయకులు కాకర్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. కొండిపర్రు గ్రామంలో రంగా జయంతిని గ్రామ టీడీపీ అధ్యక్షుడు వీరాంజనేయులు, పసుపులేటి విజయ్‌కుమార్, రావూరి శివయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. నాయకులు మద్యం శెట్టి సత్యనారాయణ, ఏకుల చిరంజీవి, సువర్ణరాజు, అల్లాడ నాగ మల్లేశ్వరరావు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు. పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఉండ్రపూడిలోని రంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు మండపాక శంకర బాబు, మట్టా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రంగా జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

పోలవరం(పామర్రు): వంగవీటి మోహనరంగా జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. మండల పరిధి పోలవరం గ్రామంలో రంగా జయంతి వేడుకలను గ్రామస్తులు గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

రంగా ఆశయ సాధనకు పాటుపడాలి

పమిడిముక్కల: రంగా ఆశయ సాధనకు పాటుపడాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా యువకులకు సూచించారు. మండలంలోని మంటాడ గ్రామంలో గురువారం రంగా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రంగా విగ్రహానికి ఎమ్మెల్యే కుమార్ రాజా పూలమాలేసి నివాళులర్పించారు. రాధారంగా మిత్రమండలి నాయకులు వంగవీటి శంతన్‌కుమార్, సర్పంచ్ నందమూడి వీరమ్మ, ఎంపీటీసీ మేరుగ రాజేశ్వరి, టీడీపీ నాయకులు జక్కా శ్రీనివాసరావు, జనసేన నాయకులు తాడిశెట్టి నరేష్ తదితరులు పాల్గొన్నారు. వేల్పూరులో వంగవీటి మోహనరంగా జయంతి వేడుకలు ఘనంగా జరిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుమలశెట్టి బోసుబాబు రంగా విగ్రహానికి పూలమాలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీను, రాజా తదితరులు పాల్గొన్నారు.



పామర్రు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు

పేదల సంక్షేమానికి రంగా కృషి

కైకలూరు: దివంగత వంగవీటి మోహనరంగా పేదల సంక్షేమానికి కృషి చేశారని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చెప్పారు. రంగా జయంతి సందర్భంగా కైకలూరు మండలం కైకలూరు గాంధీబొమ్మ సెంటర్, ఆటపాక, మండవల్లి సెంటర్లలో రంగా విగ్రహాలు, చిత్రపటాలకు గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కైకలూరు, మండవల్లిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కైకలూరులో యువకులు బాణాసంచా కాలుస్తూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, కేవీఎస్ఎం నాయుడు, మంగినేని రామకృష్ణ, తులసి పూర్ణ, రామిశెట్టి బుజ్జి, గుడివాడ చిట్టిబాబు, బోయిన రాజేష్, ముళ్లపూడి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి తరుగుమూలలో చెత్త తొలగింపు

మండవల్లి: మండవల్లి తరుగుమూలలో చెత్త చెదారాలు బాగా పెరిగిపోయి పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సర్పంచ్ మెండా ఝాన్సీ ఆదేశాల మేరకు కార్యదర్శి శ్రీనివాసరావు గురువారం జేసీబీతో చెత్త, చెదారాలను తొలగింపజేశారు. దీంతో కొంతమేర సమస్యలు తొలగుతాయని భావిస్తున్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్ పాల్గొన్నారు.

రేపు ప్రజావేదిక సమావేశం

ముదినేపల్లి రూరల్: ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి ఇప్పటి వరకు జరిగిన సామాజిక తనిఖీల నివేదికలకు సంబంధించి శనివారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద ప్రజావేదిక సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీఓ మురళీ గంగాధరరావు తెలిపారు. ఈ పనులకు సంబంధించి గత నెల 24 నుంచి ఇప్పటి వరకు 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చేసిన పనులపై సామాజిక తనిఖీలు జరిగాయన్నారు. వీటిపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన ప్రజావేదికలో మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీల సభ్యులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొనాలని కోరారు.

నిందితుడికి 14 రోజుల రిమాండ్

నందివాడ: మండలంలోని నందివాడ గ్రామంలో కడిమి నాగబాబు అనే వ్యక్తికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు నందివాడ ఎస్ఐ ఎస్.చంటిబాబు తెలిపారు. నందివాడ ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నందివాడ గ్రామం ఎస్టీ కాలనీలో నివాసం ఉంటున్న కడిమి నాగబాబు అనే వ్యక్తి తరచు మద్యం సేవించి రావడంతో కుటుంబంలో కలహాలు రేగి తరచూ గొడవలు జరుగుతుండేవి. ఇది గమనించిన అతని మేనమామ ఇలపర్తి రాధాకృష్ణ నాగబాబును మందలించాడు. దీంతో రాధాకృష్ణపై నాగబాబు దాడి చేయడంతో పోలీసులను ఆశ్రయించారన్నారు. నాగబాబుపై కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించడంతో అతనికి జడ్జి 14 రోజులు రిమాండ్ విధించారని ఎస్ఐ చెప్పారు.

మెనూ సక్రమంగా అమలుచేయాలి

ముదినేపల్లి రూరల్: మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి మెనూ ఖచ్చితంగా అమలు చేయాలని ఎంఈఓ కె.నరేష్‌కుమార్ చెప్పారు. మండలంలోని చినపాలపర్రు ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూడడంతో పాటు ప్రతి విద్యార్థి మధ్యాహ్న భోజన పథకంలో భాగస్వామలయ్యేలా చూడాలన్నారు. మెనూ సక్రమంగా అమలు చేస్తూ భోజన పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల హాజరు పాఠశాల నిర్వహణపై ఉపాధ్యాయులను అభినందించారు.